క్లుప్తంగా

గోరుముద్దలో నాణ్యత లోపిస్తే చర్యలు



సత్తెనపల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం గోరుముద్దలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ తెలిపారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గోరుముద్దను పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ క్రమం తప్పకుండా మెనూ ప్రకారం నాణ్యత కూడిన ఆహార పదార్థాల్ని విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఏ. శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం

సత్తెనపల్లి: అంకితభావంతో పనిచేస్తూ సంస్థ ఆదాయ పెంపునకు కృషి చేసిన ఉద్యోగుల్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి. కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు షేక్ బాజీ షరీఫ్, షేక్ రషీదు అత్యధికంగా హెచ్ఎస్‌డీ ఆయిల్ సాధించడంతో శుక్రవారం ఆవరణలో నగదు అవార్డులతో పాటు పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఇద్దరినీ ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

నకరికల్లు: ప్రత్యామ్నాయ పంటల పథకంలో భాగంగా రైతులకు 40శాతం రాయితీపై శనగ విత్తనాల్ని రైతుభరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకం నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు, అటవీశాఖ పట్టాలు పొందిన వారికి సైతం వర్తిస్తుందని ఆయన తెలిపారు. రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాలకు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి: సీపీఎం

సత్తెనపల్లి: పట్టణంలో పేరుకుపోయి ఉన్న ప్రజా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం సీపీఎం చేపట్టిన 'ప్రజారక్షణ భేరి' పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 17,19,20,21,22 వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యల్నిఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పాదయాత్ర ఈనెల 31 వరకు జరుగుతుందని తెలిపారు. ముగింపు సందర్భంగా అదేరోజు తాలూకా సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులను మాత్రమే నింపాలి

జలవనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి



సత్తెనపల్లి: సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేసిన నీటిని మంచినీటి చెరువుల్ని మాత్రమే నింపుకోవాలని జల వనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి చెప్పారు. సత్తెనపల్లిలోని లక్కరాజు గార్లపాడు రోడ్డులో మంచినీటి చెరువును శుక్రవారం ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు ఎన్ఎస్పీ ఈఈ మురళీధర్, సిబ్బంది ఉన్నారు.

సాగర్ జలాలు వృథా కాకుండా చూడాలి

సత్తెనపల్లి: సాగర్ జలాలు వృథా కాకుండా, సక్రమంగా చెరువుల్ని నింపాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు అధికారులకు సూచించారు. లక్కరాజు గార్లపాడు రోడ్డులో గల చెరువుకు నీటి పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువును తక్కువ సమయంలో నింపడానికి అదనంగా మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి అంబటి రాంబాబు



తొండపిలో వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి



ఇనిమెట్లలో కిట్లను అందజేస్తున్న జిల్లా డెప్యూటీ వైద్యాధికారి చంద్రశేఖర్

తొండపి(ముప్పాళ్ల): ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించేలా ప్రభుత్వం పని చేస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని తొండపిలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందుల్ని అందిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైద్య శిబిరాల్లో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటుగా గైనిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాలిటీ నుంచి ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.ప్రతి క్యాంపులో 14 వైద్య పరీక్షలతో పాటుగా 172 రకాల మందుల్ని అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో 506 మందికి వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పుట్టారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాదు, బోరుపోతు కాటయ్య, సైదా, జానీబాషా పాల్గొన్నారు.

మాదిపాడులో 352 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాదిపాడు సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 352 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, సీజనల్ జ్వరాలు, మలేరియా, రక్తహీనత తదితర పరీక్షలు చేశారు. 111 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 102 మందిని కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. 16 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో వైద్యశాలలకు రిఫర్ చేశారు. శిబిరంలో మాదిపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ యం.ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ఎస్. ప్రేమ, డాక్టర్ ఎస్. గిరిరాజు సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

ఇనిమెట్లలో 485 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: ప్రతీ కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని పల్నాడు జిల్లా డెప్యూటీ వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ఇనిమెట్ల గ్రామ సచివాలయం పరిధిలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా డెప్యూటీ వైద్యాధికారి సందర్శించారు. గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ నాగమణి, డాక్టర్ కిశోర్ సేవలందించారు. 485 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల్ని అందించారు. 130 మందికి కంటి పరీక్షలు చేసి, 14 మందిని శస్త్ర చికిత్సలు చేసేందుకు ధూళిపాళ్ల ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో నాణ్యమైన వైద్యసేవలు

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట–2 గ్రామ సచివాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని శుక్రవారం ఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సాగుతోందని తెలిపారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివ రత్నకుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు రవిబాబు, మౌనిక స్వర్ణరేఖ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 455 మంది రోగుల్ని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పావులూరి ఉమాదేవి, గ్రామ సర్పంచ్ మాదాసు పావని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ నాయుడు రాంబాబు, నాయకులు నంబూరు బాబూరావు ఆలపాటి వీరయ్య, కొండవీటి కోటేశ్వరరావు, మాదాసు రాంబాబు, నాగరాజు, సరిపూడి శివయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవులవారిపాలెంలో 430 మందికి వైద్య పరీక్షలు

ఆవులవారిపాలెం (క్రోసూరు): మండలంలోని ఆవులవారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 430 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ చంద్రతేజ్, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ మహమ్మద్ సాద్, డాక్టర్ బాలఅంకమ్మబాయి, డాక్టర్ సిరిచందన సేవలందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్యం

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుందని మండల ప్రత్యేక అధికారి ఏ.సుధాకర్ తెలిపారు. మండలంలోని భట్లూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుధాకర్ మాట్లాడుతూ జగనన్న సురక్షతో ఎంతోమంది పేదలకు నాణ్యమైన వైద్యంతో పాటు ఉచితంగా మందుల్ని అందిస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రక్షగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం శిబిరంలో వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదర రామారావు, ఎంపీటీసీ సభ్యుడు తేలుకుట్ల సైదారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భట్లూరు కోటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు ఏ.శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, డీబీఆర్సీ జిల్లా కార్యదర్శి మల్లెల చిన్నప్ప, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముప్పాళ్ల: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

రాజుపాలెంలో...

మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కె.వి.ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

క్రోసూరులో..

విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా క్రోసూరు పట్టణం, పీసపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి 1గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.బసవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

సత్తెనపల్లిలో..

పట్టణంలో 11 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మల నరికివేత, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫీజు ఆఫ్ కాల్ నంబర్ 94941 16238కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

నేడు చేజర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

నకరికల్లు: మండలంలోని చేజర్లలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

బాలికల్లో రక్తహీనతను సకాలంలో గుర్తించాలి

తల్లిదండ్రులకు పల్నాడు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ

అమరావతి: బాలికల్లో ఎప్పటికప్పుడు రక్తహీనతను గుర్తించడంలో తల్లితండ్రులు అప్రమత్తమై అవసరమైన పోషకాహారాన్ని అందించాలని పల్నాడు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. బంగారు తల్లి కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన షోషకాహారం కార్డుల ఆవిష్కరణలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం 10 నుంచి 19 ఏళ్ల బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉండటం వల్ల వారు అనారోగ్యం పాలవుతున్నట్లు చెప్పారు. నివారణ కోసం ప్రభుత్వం ఇస్తున్న పోషకాహారాన్ని క్రమపద్ధతిలో పిల్లలకు అందజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి రెండు నెలలకొకసారి వైద్యారోగ్యశాఖ సిబ్బంది సహకారంతో రక్తహీనత పరీక్షలు చేయించాలని, అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను మార్చి మంచి పోషకాహారాన్ని అందించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ, శ్రద్ధ ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 10నుంచి 19 సంవత్స రాల వయస్సున్న బాలికలందరికీ కార్డులు పంపిణీ చేస్తారని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాజేటి రాము పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాదు

స్థానిక గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో పల్నాడు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలంతా ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించడానికి తల్లిదండ్రులు సహకరించాలని ఆమె సూచించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, చదవాలనే ఆకాంక్ష విద్యార్థుల్లో ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పల్లోటి జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఫాదర్ భాస్కర్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బత్తుల విజయ,75 త్యాళ్లూరు సెక్టార్ సీడీపీవో స్వర్ణ, గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నారాసి, సిస్టర్ డియానా, సిస్టర్ ప్రియా, సిస్టర్ గ్రేసి, సిస్టర్ మార్టినా, రిటైర్డ్ ఏఈ కూచిపూడి రవిశేఖర్, గుడ్ షెఫర్డ్ సంస్థ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దమ్మాలపాడు జెడ్పీ హైస్కూలులో విద్యార్థినులకు రక్త పరీక్షలు

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బంగారు తల్లి కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు గుర్తింపు కార్డుల్ని శుక్రవారం అందించారు. 10 సంవత్సరాల వయస్సు నుంచి 19 ఏళ్ల వరకు గల బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. లోపాలుంటే అవసరమైన పౌష్టికాహారంతో పాటుగా ఐరన్ బిళ్లలు అందించడమే కార్యక్రమం ఉద్దేశమని హెచ్ఎం జి.మిరియమ్మ తెలిపారు. గతంలో నిర్వహించిన వైద్య పరీక్షలో 85 మందిని గుర్తించి, వారికి అవసరమైన మందులతో పాటు బంగారు తల్లి కార్డును అందించినట్లు తెలిపారు. పౌష్టికాహారం అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారు తల్లి కార్డుల ఆవిష్కరణ

క్రోసూరు: విద్యార్థులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారిలో రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి బంగారు తల్లి కార్డుల్లో నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ డి.శ్రీనివాసరావు తెలిపారు. క్రోసూరులోని చెంచుకాలనీలో గల ఎంపీపీఎస్(ఎస్టీ) పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. బంగారు తల్లి కార్డులను ఆవిష్కరించారు. విద్యార్థుతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో 15 విద్యార్థుల్లో రక్తహీనత లోపం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గోరుముద్దలో ఇస్తున్న పౌష్టికాహారం ద్వారా దీన్ని రూపుమాపుతామని చెప్పారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్.జాన్ పాల్, ఉపాధ్యాయులు బోళ్ల నరసింహారెడ్డి, ఫిలోమినా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బంగారు తల్లి కార్డులు అందుకున్న విద్యార్థినులతో అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ

బంగారు తల్లితో బాలికల ఆరోగ్య పరిరక్షణ

సత్తెనపల్లి: బాలికల ఆరోగ్య పరిరక్షణకే బంగారు తల్లి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఏ. సుధాకర్ తెలిపారు. మండలంలోని భట్లూరు, ధూళిపాళ్ల, గుడిపూడి, నందిగామ గ్రామాల్లోశుక్రవారం బంగారు తల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భట్లూరులో సుధాకర్ మాట్లాడుతూ బాలికల్లో హిమోగ్లోబిన్ ఎప్పటికప్పుడు పెంపుదలకు ప్రత్యేకంగా ఒక కార్డును ఏర్పాటు చేసి, దాని ద్వారా గతానికి ప్రస్తుతానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనిస్తామని తెలిపారు. బాలికలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సభలో ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారులు ఏ. శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, సర్పంచ్ ఈదర రామారావు, ఎంపీటీసీ సభ్యుడు తేలుకుట్ల సైదారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బట్లూరి కోటేశ్వరరావు, డీబీఆర్సీ జిల్లా సెక్రటరీ మల్లెల చిన్నప్ప పాల్గొన్నారు.

● గుడిపూడి, నందిగామ గ్రామాలల్లో తహసీల్దార్ ఎస్.సురేష్, ఉపాధ్యాయులు తదితరులు మాట్లాడారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించి, కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో తల్లిదండ్రులు, బాలికలు పాల్గొన్నారు.

ఐఎస్‌వో సర్టిఫికెట్‌కు నకరికల్లు పంచాయతీ ఎంపిక

నకరికల్లు: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న గడపగడపకు మన ప్రభుత్వం, 50గృహాలకు వలంటీరు, సచివాలయం వ్యవస్థ ఆదర్శనీయంగా ఉన్నాయని ఐఏఎస్ అధికారిణి బీతూ బాలకృష్ణన్ తెలిపారు. ఐఎస్‌వో సర్టిఫికెట్‌కు నకరికల్లు పంచాయతీ ఎంపికైన నేపథ్యంలో సచివాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఎస్‌వో సర్టిఫికెట్ ఇచ్చేందుకు గాను రాష్ట్రంలో 53 పంచాయతీలను గుర్తించగా, పల్నాడు జిల్లాలో నకరికల్లుతో పాటు యడ్లపాడు ఎంపికయ్యాయని తెలిపారు. ఐఎస్‌వో సర్టిఫికెట్ నిమిత్తం పంచాయతీల్లో పర్యటించి రికార్డుల పరిశీలనతో పాటు పరిపాలనా సౌలభ్యతపై అధికారులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా బిడ్డకు తల్లులు పాలిచ్చేందుకు ప్రత్యేక గది, పురుషులకు, మహిళలకు మరుగుదొడ్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పేర్లు, ఫోన్ నంబర్ల బోర్డు, ఏసీబీ బోర్డు, రికార్డుల నిర్వహణకు ప్రత్యేక గది, పరిసరాల పరిశుభ్రత ఉండాలని సూచించారు. ఇవన్నీ పాటిస్తేనే ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, డ్వామా పీడీ బి.బాలూనాయక్, డీపీవో విజయభాస్కర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ ఎం.కె.ఎస్. గిరిధర్, కార్యదర్శి భావన్నారాయణ పాల్గొన్నారు.



సర్పంచ్, అధికారులతో సమావేశమైన ఐఏఎస్ అధికారిణి బీతూ బాలకృష్ణన్

ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలి

సత్తెనపల్లి: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్. సురేష్ చెప్పారు. ఎస్వీఈఈపీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని విద్యా కేంద్రం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు తమ నివాస ప్రాంతంలో ఓటుహక్కు పొందాలని సూచించారు. ఇల్లు లేక బస్టాండ్‌లో, రైల్వే స్టేషన్‌లో నివసించే వారికి కూడా కల్పించనున్నట్లు చెప్పారు. ఓటున్న ప్రతి వ్యక్తి దాన్ని నిరభ్యంతరంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక అవసరాలు గల ఓటర్లకు కూడా ఎన్నికల కమిషన్ ప్రత్యేక వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, విద్యార్థులు, రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో పాటు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ సురేష్ , విద్యార్థులు

చర్చిల అభివృద్ధికి రూ. 16.92 లక్షలు విడుదల

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

అమరావతి: మండలంలోని పలు గ్రామాల్లో చర్చిల అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వానికి జీసస్ ఫాలోవర్స్ అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో శుక్రవారం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఆశీర్వాదాలు తెలిపారు. 2024 సంవత్సరంలో కూడా వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి అధికారంలోకి రావాలని కోరుతూ ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు నంబూరి శంకరరావు సిఫారసుతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు మూడు గ్రామాలలోని చర్చిలకు రూ. 16,92,241 విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇందులో అత్తలూరు తెలుగు బాప్టిస్ట్ చర్చికి రూ. 6,82,804, వైకుంఠపురం జీవం గల దేవుని సంఘం ఫౌండేషన్ చర్చికి రూ. 8,87,844, వైకుంఠపురం నజరే ప్రార్థనా ఫౌండేషన్ చర్చికి రూ. 1,21,595 కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రావెల అశోక్, మండలంలోని చర్చిల పాస్టర్లు ప్రకాశరావు, ప్రకాష్, పీటర్ పాల్, విజయ్ కుమార్, బాబూరావు, డేవిడ్, ఎలీషా దీపక్ పాల్గొన్నారు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న అమరావతి మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

ఇంటింటికి సంక్షేమ పథకం వైఎస్సార్ సీపీకే సాధ్యం

మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: ఇంటింటికీ సంక్షేమ పథకం వైఎస్సార్ సీపీకే సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని చేజర్లలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 300 ఇళ్లను మంత్రి సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. అమ్మ ఒడి , చేయూత, ఆసరా తదితర పథకాల గురించి వివరించారు. అవి సక్రమంగా అందుతోంది, లేనిది ? అడిగి తెలుసుకున్నారు. అప్యాయంగా మంత్రి అంబటి అడుగుతున్న తీరు ప్రజల్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా ప్రభుత్వ పాలన సాగుతోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిలో సరికొత్త ఒరవడితో పథకాల్ని పారదర్శకంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు చేయని రీతిలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగుతోందని కితాబిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పక్కాల సూరిబాబు, సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి, బొడ్లపాటి భాస్కరరెడ్డి, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, పసుపులేటి సాంబశివరావు, వెంకటేశ్వర్లు, కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల పత్రాలు అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

బాలికా విద్యతో ప్రగతికి వెలుగు

గోళ్లపాడు(ముప్పాళ్ల): బాలికా విద్యతో ప్రగతికి వెలుగు అనే అంశంపై మండలంలోని గోళ్లపాడు కేజీబీవీ పాఠశాలలో కార్డ్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గోపు అప్పమ్మ మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుంటే అన్ని రంగాల్లోనూ రాణించవచ్చని తెలిపారు. బాలిక విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల అనర్థాలపై హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరిగేటప్పుడు 1098కు కాల్ చేయవచ్చని మహిళా సంరక్షణ కార్యదర్శి జయలక్ష్మి, ఆశాలత తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫౌండేషన్ సభ్యురాలు శ్రీలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు నందిగామ విద్యార్థినుల ఎంపిక

సత్తెనపల్లి: చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఈ నెల 7నుంచి 9 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ అండర్– 19 రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పచ్చా తిరుమల వెంకట హరిప్రియ, నల్లగొండ రమ్య ప్రతిభ చాటారు. గుంటూరు జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించి, రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం కె.శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దార్ల చిట్టెమ్మబాబు, గ్రామ పెద్దలు , ఉపాధ్యాయులు అభినందించారు. డిసెంబర్ చివరి వారంలో పంజాబ్‌లో జరిగే జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు లాకు పిచ్చయ్య తెలిపారు.



క్రీడాకారిణిలను అభినందిస్తున్న హెచ్ఎమ్ శ్రీనివాసరావు తదితరులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దేవీ శరన్నవరాత్రుల 44వ మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 15 నుంచి 23 వరకు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు పూజలు, కలశస్థాపన, సహస్ర కంకుమార్చన, భజనలతో పాటు ప్రసాద వినియోగం ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చుండూరు మల్లికార్జునరావు, గౌరవ అధ్యక్షుడు కోట భాస్కర్, సెక్రటరీ కూరపాటి లక్ష్మీనారాయణ, తొమ్మండ్రు నాగేశ్వరరావు, దేవరశెట్టి నాగేశ్వరరావు, కట్టమూరి అప్పారావు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరణలో ఆలయ కమిటీ సభ్యులు